# వేమన కవిత్వం-హాస్యం

**శ్రీమతి పి. శైలజ, తెలుగు అధ్యాపకురాలు,**
**గవర్నమెంట్ డిగ్రీ మహిళా కళాశాల, మర్రిపాలెం, విశాఖపట్నం**

నవరసములలో హస్యమొకటి ప్రాచీనుల హస్యము అసహ్యములను, అసభ్యములను వర్ణించుటయందు చరితార్ధమైనది - కావుననే హాస్యర సప్రధానమైన ప్రాచీన ప్రహసములనుచదువుట కిప్పటివారు ఇష్టపడరు. వేమన హాస్యములో ఇట్టి దోషమంతగా కనబడదు. దోషమంతగా కనబడదు. అంతేకాదు - వేమన కవితను శక్తివంతమైన సంఘ సంస్కరణ సాధనముగా చేసినది ఆయన హాస్యము.

హాస్యమునకు మూలప్రకృతి ఇతరుల యందలి తప్పులను బైటపెట్టుట. తప్పు కలదనే అభిప్రాయము సామాన్యులకు స్ఫురించని తావులలో అకస్మికముగా వెలికిదీసిన హాస్యమునకు బలమెక్కువ.

వేమన గొప్ప బోధకుడు, సంస్కర్త కావున అతని యందు హాస్యరసము కలుషితమైయున్ననూ స్వతంత్ర బుద్ధికలవాడు కనుక ఒక్కొక్కమారం తన పని మరచి స్వచ్ఛమైన హాస్యముతో తృప్త కలిగించును.

ఉదా:- “ పాల సాగరమున పవ్వళించినవాడు.
గొల్ల యిండ్ల పాలు కోరనేల............
ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపి”

విన్నవాడు కృష్ణభక్తుడైనను నవ్వకుండ నుండలేడు.

గొప్పగురువులు ఊళ్ళలో నుండరు. కానీ గుహలలో నుందురు. వారి ఆశ్రయము లేనిది ముక్తి మార్గము దుర్లభము అని ఎవరో అన్న ఈ మాటను వేమన తన బాణీలో ఇట్లు వెల్లడించేను :

“గుహలలోన జొచ్చి గురువుల వెదకంగ
క్రూర మృగమొకండు తారసిలిన
ముక్తి మార్గమదియె ముందుగా జూపురా...”

సామాన్యముగా ఇతరుల లోపములనెత్తి ఖండించినపుడు దానికి ఎన్నిపదాలు కావలయునో యంతటితో తృప్తిబొందక ఇతరులకు నవ్వు కల్గింప వలయును తలంపుతో కొన్ని కొసరు మాటు చేర్చి వ్రాయుట వేమన పద్ధతి.

“గొడ్డుటావు బితుక గుండ గొంపపోయిన
పండ్లు రాలదన్ను పాలనీదు
లోభివాని నడుగు లాభంబు లేదయా...................”

ఇందు మనిషి ఆత్రమును స్పష్టముగా చూపించుటవలన, అతని అజ్ఞానమునకు మనకు నవ్వు వచ్చును. ఉపవాసమున్న దేహమందు జీర్ణము కాని మలములన్నియు జీర్ణమగునని వైద్యశాస్త్రము చెపుతుంది. వేమన్న దానిని

“కూడు బెట్టకున్న కుక్షిలో జఠరాగ్ని
భక్షణంబు చేయు గుక్షి మలము.........
కూడు విడిచి మలము గుడుచురా యుపవాసి..............”

ఈ మాటలను విని భాధపడినవారెంత మందియున్నా కొందరైనను సంతోషించెదరు. కానీ ఈ క్రింది ఉదాహరణను అందరూ హాస్యరసభరితముగా గ్రహించెదరు.

“సకల తీర్థములను సకల యజ్ఞంబుల
తలలు గొరుగకున్న ఫలములేదు
మంత్రజలములకన్న మంగలిజల మెచ్చు”

ఆంధ్రప్రదేశమున వేమనను మహకవిగా నిలబెట్టిన విషయములలో ‘నీతి’ కూడా ఒకటి, ఇహలోకమున ఇతరులకు, తనకు సౌఖ్య మును కల్గించునట్టిది నీతి. వేమన నీతులు స్వార్దులు, పరార్ధములని రెండు విధములు వేమన నీతులకు అనుభవమే మూలము, మంచిచెడ్డలు రెండిటిని తాను చేసి, యందలి తత్వమును చక్కగా గ్రహించి, యితరులకు బోధించినవాడగుటచే నీతి గ్రంధములో మాదిరిగాగాక తీవ్రత హెచ్చుగానుండును.

“విన్న వాని కన్న కన్నవాడధికండు
కన్న వారి కన్న కలియువాడు.............”

అనే మాట వేమన చెప్పిన నీతులకు అన్వయించును.

ప్రపంచమున అన్నియు స్వార్ధములే పరోపకారము కూడా పుణ్యమును స్వార్ధమే పరోపకారమునందు వేమనకు ఇష్టమైనది ఔదార్యము లోభిం ానిమీద ఇతనికి అసహ్యము లోభివాడు చావాలంటే అతనిని డబ్బు అడిగితే చాలు. చచ్చిపోతాడు పిసినివాని గూర్చి చెప్పుచూ

“ పిసిని వారి యింట బీనుగ వెడలిన
కట్టెకోలలకును కాసులిచ్చి
వెచ్చమాయెననుచు వెక్కి వెక్కేడ్చురా................”

వేమన్నకు అన్నదానము తరువాత ఇష్టమైనది కన్యాదానము. ఆనాడు స్త్రీలు తక్కువ. గొప్పవారు ఏ విధముగానైనను భార్యలను, కోడండ్రను తెచ్చుకొనుచుండిరి, పేదవారికి పెండ్లియగుట కష్టమయ్యెను. కనుక కన్యాదానము బీదలకే చేయవలెను అని వేమన అభిప్రాయము.

"కలిమి చూచి యియ్య గాయమిచ్చినట్లు
సమునకియ్య నదియు సరసతనము
పేదకిచ్చి మనువు పెనవేసినట్లుండు......"

ఉదారబుద్ధి ఉన్ననూ పాత్రాపాత్రా వివేకమవసరమని యతని భావము. దానము పొందుటకు కులము గుణము, జాతి ముఖ్యములు కాదు. ముఖ్యము పేదరికమే యని వేమన భావము.

పాపము, పుణ్యము అను భావములు మానవ కల్పితములనియు దేవుడు చేసినవి కాదని ఇతని మతము.

"మేనమామ బిడ్డ మెరసి పెండ్లమాయె
అరవలందు చెల్లెలాయె నదియు
వలసిన పుణ్యంబు వలదన్న దోషంబు"

వేమన్నకు అహింసపై ప్రీతిమెండు

"జీవి జీది జంప శివుని జంపుటెయగు
జీవుడరసి తెలియ శివుడు కాడె"

వేమనకు మజ్ఞములలో బలి పరమహింసాత్మకముగా తోచెను. అతనికి శత్రువును కూడా హింసించుటకిష్టములేదు.

"చంపదగినయట్టి శత్రువు తనచేత
చిక్కెనేని కీడు చేయరాదు
పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు "

నిజమునకు శత్రుత్వము చావలయును కాని శత్రువు కాదు. వేమన తత్వమిదియే.

ఈ విధముగనే ప్రపంచమునందు పలుకుబడి, మర్యాద సంపాదించుటకు తక్కిన యన్నింటికన్న ద్రవ్యము (డబ్బు) ముఖ్యము. కనుక దానిని సంపాదించుమని వేమన చెప్పినాడు.

"కులముగలుగువారు గొత్రంబుగలవారు
విద్యచేత విఱ్ఱవీగువారు
పసిడి గల్గువాని బానిస కొడుకులు.........."

వేమన కవితలో ధర్మము తత్వము నీతి పుష్కలము, వేమన్నను అర్ధముచేసుకొనుటకు విద్య వివేకము, సహృదయము, వాసనా పరిపకవ్వత అవసరము వేమన్న మహాకవి ప్రజాకవి సంఘసంస్కర్త.

వేమన చెప్పిన స్వార్ధనీతులలో, వివేకం ఎక్కువగా కన్పిస్తుంది కారణం అతనికి ఆ విషయంలో స్వానుభవం ఉన్నది. మనుష్యులు లోకంలో ప్రశాంతిగా సౌఖ్యంగా జీవించాలని ఆయన అభిమతం. ఈ విధంగా బ్రతకటానికి అవసరమైన ఓర్పు, వివేకము మొదలగు గుణాలను ఇతడు తన పద్యాలలో నిబంధించి, మనకు బోధిస్తుంటాడు. చాలా మంది అవివేకుల అవివేకాన్ని గుర్తించరు. ఈ సూక్ష్మ విషయాన్ని వేమన గ్రహించాడు. అందుకే ఈ క్రింది పద్యంలో ఇలా అంటాడు.

" ఎదుటి వాని బలము లెంచుకోనేరక
ఢీకొని చలమున నెదిర్చెనేని
ఎలుగు దివిటి సేవ కేర్పడు చందంబు....."

ఎలుగుబంటి కాగడా పట్టుకొంటే ఏమౌతుంది. ఒళ్ళంతా కాలుతుంది. ఇక్కడ ఎలుగుబంటి శరీర స్థితికన్నా దాని అవివేకమే ప్రతిఫలిస్తుంది. మన స్థాయికి మించిన చోట ఉన్నప్పుడు అధికులమని చెప్పుకోవటం కూడా తగదు.

ఈ భావాన్ని ఈ పద్యంలో ఇలా చెప్పాబు.

" అనువుగాని చీట నధికులమనరాదు
కొంచెముండుటెల్ల కొదువ గాదు,
కొండ యదమందు కొంచెమె యుండదా..?

అనువుగాని చోట గొప్పవాళ్ళం అని భావించి, భంగపగకూడదు. నీ స్థితి తక్కువగా ఉన్నంత మాత్రాన తప్పులేదు. అద్దంలో కొండ చిన్నదిగానే కనిపిస్తుంది కదా సృష్టిలోనే తారతమ్యాలున్నాయి. కొండ అద్దంలో చిన్నగా కనపడినంత మాత్రంచే అది ఏమన్నా చిన్నదైందా? పెద్దవాళ్ళు ఉన్నచీట చిన్నగా ఉండటం చేత లోపమేమీలేదని వేమన భోదిస్తాడు.

ఎవరైనా తనను దండించినపుడు, తిరగబడటం బలం ఉండటానికి గుర్తుకావచ్చు కానీ ఆ దండించటం తనకు మేలే అనుకొవటం వివేక లక్షణం ఈ క్రింది పద్యంలో అది కనపడుతుంది.

" చాకి కోక లుదికి చీకాకు పడజేసి
మైలదీసి లెస్సమడిచినట్లు
బుద్ధిచెప్పువాడు గ్రుద్ధితేనేమయా........"

రజకుడు (చాకలి) బట్టలను చక్కగా ఉతికి వాటిని అటు ఇటు విదిల్చి మురికి అంతా పోగొట్టి అరవేసి, మడిచి శుభ్రపరు స్తాడు. ఆవిధంగానే బుద్ధిచెప్పేవాడు గుద్దితు మాత్రం తప్పేమిటి! తల్లిదండ్రులు పిల్లలను, గురువులు శిష్యులను శిక్షిస్తే తప్పులేదు. మంచికోసం వారు ఆ పనిచేస్తున్నారు అవతలివాళ్ళు ఎంతవాళ్ళు మనమూ అంతవాళ్ళమే అనుకొని పిల్లలు, శిష్యులు ఎదురు తిరిగితే పాడైపోయేది వాళ్ళే లోకం తీరు ఇటువంటి ప్రవర్తన వల్ల నాశనమవుతుందని వేమన్న ఈ పద్యం ద్వారా హెచ్చరిక జేస్తున్నాడు.

వేమన మన కుటుంబాలలోని మానవ ప్రవత్తులను రెండు విధములుగా చెప్పాడు. మొదటి పద్ధతి ప్రత్యక్షంగా చెప్పటం - రెండవది వ్యంగంగా చెప్పడం - కొంత మంది పురుషులు వివేకంలేని స్త్రీల మాటలు విని, నాశనం పొందుతున్న విధానాన్ని వేమన తన పద్యాల్లో ఇలా వివరిస్తాడు.

ఆలిమాటలు విని అన్నదమ్ములరొసి<br>
వేఱపోవు వాడు వెఱ్ఱివాడు<br>
కుక్కతోక బట్టి గోదావరీదునా?..............

పెళ్ళాం మాటలు విని, అన్నదమ్ములంటే రోతపుట్టి, వేరే కాపురానికి పోయే వాడు వెర్రివాడు. ఇది ఎట్లాగంటే కుక్కతోక పట్టుకొని గోదావరిలో ఈదటం వంటిది పెళ్ళి అయిన తర్వాత పెళ్ళాన్ని బెల్లంగా ఇతరులను అల్లంగా చేసే ప్రవృత్తి గల కొంత మంది మగవాళ్ళన్నారు. ఈ విషయాన్ని వేమన వ్యంగ్యంగా ఇలా చెప్పాడు.

" ఆలి వంకవారు ఆప్తబంధువులైరి<br>
తల్లి వంకవారు తగినపాటి<br>
తండ్రి వంకవారు దాయాది పగవారు............"

పెళ్ళాం తరుపునవారు ఆప్తబంధువులైనారు తల్లితరువునవారిని కొద్దిపాటిగా చూడటానికి వీలుంది.తండ్రి తరుపునవారు దాయాదులాంటివారు. పగవారితో సమానం ఇటువంటి ధోరణి మగవాళ్ళకు ఉండకూడదు. ఉన్నా భార్య సరిదిద్దాలి. సరిదిద్దని ఇల్లాలు కూడా మొగుడితో ఆ కుటుంబం పరువు రచ్చకు ఎక్కుతుంది ఇటువంటి ప్రవృత్తిని మానుకోమంటాడు వేమన.

" పనస తొనల కన్న పంచదారలకన్న<br>
జుంటితేనె కన్న జున్ను కన్న<br>
చెఱుకు రసము కన్న చెలి మాట తీపిరా................"

కొంతమంది పురుషులు స్త్రీల మాట జవదాటరు. వారంటే అంత ప్రేమ వాళ్ళకు ఉంటుంది. ప్రపంచంలో ఏదైనా తాను వలచిన స్త్రీ ముందర దిగదుడుపే అటువంటివాటిని మార్చటం కష్టం ఈ భావాన్నంతా పరిష్కార మార్గం చూపకుండా యథాస్థితిని వేమన్న వ్యంగ్యంగా చెప్పాడు.

ఇటువంటి హాస్యముతో వేమన కవితాధార ఆచంద్ర తారార్కము కీర్తిమంతమగును. భోధకులు దృష్టి నీతి మీదనే ఉంటుంది అటువంటివాదు కవిత్వముపైనను, హాస్యముపైనను దృష్టినుంచరు. వేమన బోధకుడైనను కొన్ని తావులు ఆ సంగతి మరుగునపడి నిజమైన కవి. హాస్యసృష్టి బయల్పడినది. అది ఆంధ్ర పాఠకుల అదృష్టము.